ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
చిత్తూరు జిల్లా వార్తలు
శుక్రవారం 8 నవంబరు 2024



ఉచిత సిలిండర్‌కు 1.11 లక్షల బుకింగ్స్

● మృతుల పేరిట కనెక్షన్ ఉంటే మార్చుకునే అవకాశం : జేసీ



చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): 'దీపం-2 పథకం కింద ఉచిత సిలిండర్ కోసం ఎనిమిది రోజుల్లో 1,11,165 మంది బుకింగ్స్ చేసుకున్నారు. ఆతృత, ఆందోళన వద్దని.. అర్హులందరికీ పథకం వరిస్తుంది' అని జేసీ విద్యాధరి అన్నారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మీడియాకు వివరాలు తెలిపారు. ఆమె మాటల్లోనే.. 'ఇప్పటివరకు 64,759 సిలిండర్లు డెలివరీ చేయగా, 22,101 మందికి సబ్సిడీ మొత్తాలు విడుదలయ్యాయి. వీరిలో 10,994 మంది ఖాతాల్లో సబ్సిడీ నగదు జమైంది. జిల్లావ్యాప్తంగా 5,43,202 రేషన్‌కార్డులుండగా, 5,80,297 ఎల్పీజీ వినియోగదారులు ఉన్నారు. ఈ పథకానికి అర్హులమా కాదా అనే అనుమానంతో వినియోగదారులు ఆతృతతో బుకింగ్‌లు చేస్తున్నారు. ఆధార్, రేషన్ కార్డు కలిగి ఈకేవైసీ చేసుకుని ఉంటే రాయితీ వర్తిస్తుంది. ఇప్పటివరకు 85శాతం మంది ఈకేవైసీ చేసుకున్నారు. మిగిలినవారు డెలివరి బాయ్ వద్ద కూడా ఈకేవైసీ చేసుకోవచ్చు. అర్హులందరికీ 2025 మార్చి 31వ తేదీ వరకు ఉచిత సిలిండర్ అందుతుంది. ఒక రేషన్‌కార్డులోని సభ్యుల పేరిట రెండు లేదా మూడు కనెక్షన్లు ఉన్నా రాయితీ మాత్రం ఒక్క కనెక్షన్‌కే వస్తుంది. ఒకవేళ మృతుల పేరిట గ్యాస్ కనెక్షన్ ఉంటే డీలర్‌కు పూర్తివివరాలు ఇచ్చి ఆయా కంపెనీల వద్ద పేరు మార్చుకోవచ్చు. ఇతర సమస్యలుంటే టోల్‌ఫ్రీ నెంబరు 1967కు లేదా సమీప వార్డు సచివాలయాలను సంప్రదించాలి' అని విద్యాధరి వివరించారు. సమావేశంలో డీఎస్వో శంకరన్ పాల్గొన్నారు.

ఆ రూ.7 కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లిస్తాం : జడ్పీ సీఈవో



చిత్తూరు రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల క్రితం చేసిన పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ చెల్లింపులు ప్రారంభించినట్లు జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు తెలిపారు. గురువారం జడ్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జడ్పీ అనుమతులతో జిల్లావ్యాప్తంగా సుమారు 402 పనులు నిర్వహించినట్లు చెప్పారు. వీటికి సంబంధించి రూ.7 కోట్ల మేర బిల్లులను వైసీపీ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందన్నారు. వాటిని కూటమి ప్రభుత్వం చెల్లించాలని ఇటీవల ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. ఇప్పటివరకు 60 పనులకు సంబంధించిన బిల్లులను చెల్లించనట్లు తెలియజేశారు. మిగిలిన వాటిని ఈ నెలాఖరులోపు చెల్లిస్తామన్నారు. అలాగే మండలాల్లో చేసిన పనులకు సంబంధించి రికార్డులు సక్రమంగా ఉంచాలని ఎంపీడీవోలను ఆదేశించారు. ఇప్పటికే పలమనేరు, పులిచెర్ల, పెనుమూరు, విజయపురం తదితర మండలాల్లో తనిఖీలు నిర్వహించామన్నారు.

వృద్ధురాలిపై హత్యాచారం కేసులో జీవిత ఖైదు



ఇంద్రప్రసాద్

చిత్తూరు లీగల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి హత్యాచారం కేసులో నిందితుడికి చిత్తూరు కోర్టు జీవిత ఖైదు విధిస్తూ సంచలనాత్మక తీర్పును ఇచ్చింది. అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం సద్దిగూరువారిపల్లెకు చెందిన ఇంద్రప్రసాద్ 2018లో ఫూటుగా మద్యం తాగి 90 ఏళ్ల వృద్ధురాలిపై అత్యాచారం చేసి.. అతి కిరాతకంగా చంపేశాడు. దీనిపై అప్పటి సీఐ మురళీ కృష్ణ 2018 ఏప్రిల్ 6వ తేదీన కేసు నమోదు చేసి.. రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు గురువారం చిత్తూరు ఆరవ ఏడీజే, పోక్సో ఇన్‌చార్జి కోర్టులో వాయిదాకు వచ్చింది. విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడికి అత్యాచారం చేసినందుకు 20ఏళ్లు, చంపినందుకు 14 ఏళ్లు.. మొత్తం 34 ఏళ్ల శిక్షను విధిస్తూ న్యాయమూర్తి శాంతి తీర్పు ఇచ్చారు. ఈ కేసును ఏపీపీ తోట పురుషోత్తం వాదించారు.



గుడియాత్తం రోడ్డు దుస్థితిపై జోడిచింతల వద్ద గత నెలలో మహిళల నిరసన(ఫైల్ ఫోటో)

- జిల్లాలో ఆర్‌అండ్‌బీ రోడ్లు: 2436 కి.మీ
- స్టేట్ హైవే రోడ్లు: 458కి.మీ
- జిల్లా రోడ్లు: 1977కి.మీ
- దెబ్బతిన్న రహదారులు: 1709 కి.మీ
- మరమ్మతులకు ప్రతిపాదనలు: రూ.15.21 కోట్లు
- గుంతలు పూడ్చనున్నవి: 482 కి.మీ.లు
- మంజూరు చేసిన నిధులు: రూ.6.72 కోట్లు
- ఇంకా గుంతలున్న రోడ్లు: 1227 కి.మీ

వైసీపీ గుంతలకు కూటమి ప్యాచ్‌లు!

◆ ఐదేళ్లలో దెబ్బతిన్న రహదారులు 1709 కి.మీ
◆ మరమ్మతులు ప్రారంభించిన కూటమి ప్రభుత్వం
◆ రెండు విడతల్లో రూ.22 కోట్లతో పనులు

చిత్తూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్లలో చేసిన దారుణాల్లో రహదారులపై నిర్లక్ష్యం కూడా ఉంది. కొత్త రహదారుల్ని వేయడం అటుంచితే, పాత వాటికి నిర్వహణ కూడా చేపట్టలేదు. దీంతో జిల్లాలో చాలా చోట్ల రోడ్ల మీద గజానికో గుంత ఉంది. ఆ గుంతల్లో పడి వాహనాలు పాడైపోవడం, ప్రయాణికులు ఇబ్బందులు పడడంతో పాటు మరణించినవారూ ఉన్నారు.ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం రహదారులపై దృష్టి సారించింది. గుంతలు లేని రోడ్లే లక్ష్యంగా మరమ్మతు పనులను ప్రారంభించింది.



యాదమరి మండలంలోని జోడిచింతల నుంచి తమిళనాడు సరిహద్దు వరకు 11 కిలోమీటర్ల రహదారి అధ్వానంగా ఉంది. చిత్తూరు నుంచి యాదమరి మీదుగా గుడియాత్తం వరకు ఉన్న ఈ అంతర్రాష్ట్ర రహదారిలో ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది పెట్రోల్ ట్యాంకర్ ఈ గుంతలమయమైన రోడ్డులో తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన పత్రపల్లె వద్ద నిలిచిపోయింది. జేసీబీ సాయంతో రోడ్డును పక్కకు లోడి, ట్యాంకరును బయటికి తీశారు. వైసీపీ హయాంలో ఈ రహదారి మరమ్మతులకు ఆర్‌అండ్‌బీ అధికారులు అనేకమార్లు ప్రతిపాదనలు పంపించినా ఒక్కసారి కూడా నిధులు విడుదల కాలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే మురళీమోహన్ ఈ రోడ్డును బాగు చేయించేందుకు రూ.10 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. ప్రస్తుతం గుంతలు పూడ్చేందుకు రూ.20 లక్షల్ని కేటాయించారు.



పెనుమూరు-చిత్తూరు రోడ్డులోని ఉగ్రాణంపల్లె వద్ద రోడ్డు దుస్థితి

కనీస నిర్వహణ కరువై....

సాధారణంగా ఏ రహదారి అయినా ఏడాదికోసారి నిర్వహణ చేపట్టాలి. అప్పుడే ఆ రహదారులు బాగుంటాయి. లేకుంటే గుంతలు పడి ఛిద్రమైపోతాయి. 2019 వరకు రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, కొత్త రహదారుల్ని మంజూరు చేయడంతో పాటు ఆయా రహదారుల నిర్వహణకు ఏడాదికోసారి నిధుల్ని మంజూరు చేసేది. వైసీపీ ప్రభుత్వం మాత్రం కొత్త రహదారులను మంజూరు చేయలేదు.వున్న రోడ్ల నిర్వహణ కూడా చేపట్టలేదు. రహదారుల నిర్వహణకు ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులు ఎప్పటికప్పుడు ప్రతిపాదనలు పంపించినా నిధులు మాత్రం మంజూరయ్యేవి కావు.

రెండు విడతల్లో రూ.22 కోట్లతో పనులు

జిల్లాలో దెబ్బతిన్న రహదారుల్ని రెండు విడతల్లో సంక్రాంతిలోగా బాగు చేయనున్నారు.జిల్లాలో 1709 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. తొలి విడతలో 482 కిలోమీటర్ల రహదారుల్ని బాగు చేసేందుకు రూ.6.72 కోట్లు మంజూరయ్యాయి.గత శనివారం ఈ పనుల్ని ప్రారంభించారు. రెండో విడతలో 1227 కిలోమీటర్ల రహదారుల్ని బాగు చేసేందుకు రూ.15.21 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపించారు. నేడో రేపో ఈ నిధులు కూడా మంజూరయ్యే అవకాశాలున్నాయి.

నివర్ తుపాను గాయాల్నీ పట్టించుకోని వైసీపీ

2021 చివర్లో జిల్లాను నివర్ తుఫాను కుదిపేసింది. ప్రాణ, పశు, పంట నష్టాలు పెద్దఎత్తున జరిగాయి. రహదారులు, చెరువులు వంటివి ధ్వంసమయ్యాయి. ప్రాణ, పశు, పంట నష్టాలకు పరిహారం ఇచ్చిన ప్రభుత్వం.. రహదారులు, చెరువుల శాశ్వత మరమ్మతులను పట్టించుకోలేదు. తాత్కాలిక మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకుంది. అప్పట్లో ఉమ్మడి జిల్లాలో 321 కిలోమీటర్ల పంచాయతీరాజ్ రోడ్లు, 539 ఆర్‌అండ్‌బీ రోడ్లు దెబ్బతినగా శాశ్వత మరమ్మతులకు రూ.534 కోట్ల నిధులు అవసరమయ్యాయి. రూ.37 కోట్ల నిధులతో తాత్కాలిక మరమ్మతు పనులు చేశారు తప్ప.. శాశ్వత చర్యలకు పూనుకోలేదు.

కరెంటు కష్టాలకు స్వస్తి



తోటకనుమ సబ్ స్టేషన్ ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, కలెక్టర్ సుమిత్‌కుమార్

వి.కోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వి.కోట మండలం తోటకనుమలో నిర్మించిన 132/33 కేవీ సబ్ స్టేషన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం వర్చువల్‌గా ప్రారంభించడం గర్వకారణమని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు.రూ. 38 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ సబ్ స్టేషన్ అందుబాటులోకి రావడం ద్వారా 46వేలమందికి లబ్ధి చేకూరుతుంద న్నారు. వి.కోట, బైరెడ్డిపల్లె, శాంతిపురం మండలాల్లో గృహ అవసరాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. అలాగే పగటిపూట 9 గంటల వ్యవసాయ విద్యుత్ సరఫరా అందించడానికి వీలవు తుందన్నారు.వి.కోట, బైరెడ్డిపల్లె, శాంతిపురం మండలాల పరిధిలోని అన్ని సబ్ స్టేషన్లకు తోటకనుమ నుంచి హై, లో ఓల్టేజీ లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు.భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వ సహకారంతో సబ్ స్టేషన్ల నుంచి నేరుగా గ్రామాలకు ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చి విద్యుత్ అందించే అవకాశముందన్నారు.కలెక్టర్ సుమిత్‌కుమార్,ఆర్డీవో భవాని, డీఎస్పీ ప్రభాకర్, ట్రాన్స్‌కో ఎస్ఈ (ఆపరేషన్స్) ఇస్మాయిల్, ఈఈలు శ్రీనివాసమూర్తి, చంద్రశేఖర్, చిన్నప్ప శేఖర్, ఏడీఈలు గణేష్‌రెడ్డి, చిన్నబ్బ, ఏఈలు రామకృష్ణ, తహసిల్దార్ పార్వతి, సీఐ సోమశేఖర్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామచంద్రనాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు రంగనాథ్, నేతలు ఈశ్వర్, రాంబాబు, చంద్రారెడ్డి, రామచంద్ర, సోము, సుబ్బన్న, ధీరజ్, శబరీష్, త్యాగరాజు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ నాయకులను పలకరిస్తున్న బ్రాహ్మణి

శివపురంలో నారా బ్రాహ్మణి

శాంతిపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం శివపురం సమీపంలో నిర్మాణంలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇంటిని గురువారం ఆయన కోడలు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సతీమణి నారా బ్రాహ్మణి పరిశీలించారు. శాంతిపురం మఠం వద్ద ఉన్న హెరిటేజ్ సంస్థకు వచ్చిన ఆమె తొలుత రైతులతో సమావేశమయ్యారు.అనంతరం చంద్రబాబు ఇంటివద్దకు వచ్చిన ఆమెను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం, ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్,టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, టీడీపీ సలహాదారు నరేశ్ ఆచారి తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇంటి నిర్మాణంలో వేగం పెంచి, త్వరలో పూర్తయ్యేలా చూడాలని నిర్మాణ కాంట్రాక్టు తీసుకున్న ఎల్ఎన్‌టీ ప్రతినిధులకు బ్రాహ్మణి సూచించారు.

చెలరేగిపోతే ఇక కుదరదు!

సోషల్ మీడియా పేరుతో రెచ్చిపోతున్నవారిపై పోలీసు కన్ను



చిత్తూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా పేరుతో రెచ్చిపోతున్న రాజకీయ మూకలపై కూటమి పార్టీల నేతలు కన్నెర్ర చేయడంతో జిల్లాలోనూ దాని ప్రకంపనలు మొదలయ్యాయి.గ్రూపుల్లో చెలరేగిపోయేవారు తమ నెత్తికొస్తుందేమో అని ఆందోళన చెందుతున్నారు. ఇటువంటి వారిపై జిల్లా పోలీసులు ఇప్పటికే నిఘా కన్ను వేశారు.

కార్వేటినగరంలో కేసు నమోదు

సీఎం చంద్రబాబు కుటుంబంలోని మహిళల ఫొటోల్ని మార్ఫింగ్ చేసి ఫేస్‌బుక్‌లో పోస్టు చేసిన విషయంగా రెండు నెలల కిందట కార్వేటినగరంలో కేసు నమోదైంది. విషయం తెలుసుకున్న నిందితుడు తన ఫేస్‌బుక్ అకౌంట్‌ను డిలీట్ చేశాడు. దీంతో పోలీసులు అతన్ని పట్టుకోలేకపోతున్నారు. నిందితుడి వివరాల కోసం ఫేస్‌బుక్ హెడ్‌క్వార్టర్స్‌కు మెయిల్ చేశారు. వివరాలు వచ్చాక అరెస్టు చేసే అవకాశాలున్నాయి.

సోషల్ మీడియా సెల్ ఏర్పాటు

సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టేవారిని గుర్తించేందుకు జిల్లాలో ప్రత్యేకంగా సోషల్ మీడియా సెల్ నడుస్తోంది. 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎస్పీగా పనిచేసిన రాజశేఖర బాబు ఈ సెల్‌ను ఏర్పాటు చేశారు. వైసీపీ ప్రభుత్వం దీన్ని పెద్దగా పట్టించుకోలేదు. ఎన్నికల సమయంలో మాత్రం సీఐ శ్రీధర్ పనిచేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ విభాగాన్ని పటిష్ట పరిచారు. సాంకేతిక పరిజ్ఞానం ఉన్న పోలీసులకు ఇక్కడ పోస్టింగులు ఇచ్చారు. ప్రస్తుతం సీసీఎస్ సీఐ ఉమామహేశ్వరరావు ఈ విభాగానికి ఇన్‌ఛార్జి సీఐగా పనిచేస్తున్నారు. ఎవరైనా ప్రమాదకర, ఇబ్బందికర పోస్టులు పెడితే వెంటనే అలర్ట్ అయి చర్యలు తీసుకునేలా ఏర్పాటు చేసుకున్నారు.

అందరి పోస్టులనూ గమనిస్తున్నాం

భావ ప్రకటనా స్వేచ్ఛ పేరుతో ఎదుటి వ్యక్తి మనోభావాలు దెబ్బతీసేలా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే ఊరుకోం.అదే స్వేచ్ఛను రాజ్యాంగం అందరికీ కల్పించింది. ఒకప్పుడు ఫిజికల్ గొడవ పడేవారు. ఇప్పుడు దానికి మించి సోషల్ మీడియాలో మనసును గాయపరుస్తున్నారు. నోటితో చెప్పలేని పోస్టులు పెడుతున్నారు. ఈ క్రమంలో జిల్లాలో సోషల్ మీడియా సెల్‌ను పటిష్టపరిచాం. ఈ సెల్ ప్రతి పోస్టునూ గమనిస్తూ ఉంటుంది. శృతి మించితే కఠిన చర్యలు తీసుకుంటాం.

-మణికంఠ, ఎస్పీ

పెచ్చులూడిన విశ్రాంతి గది



● ముగ్గురు ప్రయాణికులకు గాయాలు
● తిరుపతి రైల్వేస్టేషన్‌లో ఘటన

తిరుపతి(సెంట్రల్)నవంబరు7(ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వేస్టేషన్ విశ్రాంతి హాలులో గురువారం శ్లాబ్ పెచ్చులూడి పడి ముగ్గురు ప్రయాణికులు గాయపడ్డారు. మొదటి ప్లాట్‌ఫారంలో ఉన్న మహిళల విశ్రాంతి హాలులో గురువారం మధ్యాహ్నం విశ్రాంతి తీసుకుంటున్న మహిళలపై సిమెంటు పెచ్చులూడి పడ్డాయి. ముగ్గురు గాయపడడంతో వారిని రుయాస్పత్రికి తరలించారు. ఇందులో ఒకరికి తీవ్రంగానూ, మరో ఇద్దరికి స్వల్పంగానూ గాయాలయ్యాయి. పాత భవనాలకు మరమ్మతులు చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

బీఎన్ కండ్రిగలో అఘోరితో మాట్లాడుతున్న సీఐ



పంతం వీడి.. వస్త్రాలు ధరించి..

● శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకున్న అఘోరి

శ్రీకాళహస్తి/బుచ్చినాయుడు కండ్రిగ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): దిగంబరంగానే శివుడ్ని దర్శించుకుంటానని గురువారం ఉదయమంతా ఆగడం చేసిన అఘోరి.. సాయంత్రానికి పంతం వీడి వస్త్రాలు ధరించి ఆలయానికి వచ్చారు. శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద దిగంబరంగా వెళ్లిన అఘోరిని అధికారులు అడ్డుకున్నారు. వస్త్రాలు ధరిస్తేనే ఆలయంలోకి అనుమతిస్తామని స్పష్టంచేశారు. దీంతో ఆమె పెట్రోల్ పోసుకుని ఆత్మార్పణ చేసుకుంటానని చెప్పగా.. పోలీసులు అనునయించి తమిళనాడు పరిధిలోని ఆరంబాకంలో వదిలిపెట్టారు. మళ్లీ ఆమె శ్రీకాళహస్తికి బయలుదేరారు. సాయంత్రం బుచ్చినాయుడు కండ్రిగ వద్దకు ఆమె కారు చేరుకోగా.. పోలీస్ స్టేషన్ వద్ద సీఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథ నాయుడు సిబ్బందితో కలిసి అడ్డుకున్నారు. ఆమె కారును తనిఖీ చేశారు. అఘోరి ఒంటిపై బట్టలు లేకపోవడంతో శాలువా ఇచ్చి కట్టుకోమని ఒప్పించారు. అనంతరం అఘోరిని దించి కారు తనిఖీ చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి తాను వస్త్రాలు ధరించి వెళతానని ఆమె చెప్పడంతో బందోబస్తుతో పోలీసులు ఆమెను తీసుకెళ్లి, స్వామి, అమ్మవార్ల దర్శనం చేయించారు.



గజరాజు చాటున..

గజరాజుకు అటు, ఇటు మావటిలు. ఒకటో జోరు వాన. వానకు తడవకుండా గజరాజుపై కప్పిన వస్త్రాన్ని చాటు చేసుకున్నారు. ఇలా వీరు మంగళవారం శ్రీవారి ఆలయం ముందు గజరాజు పక్కన వస్తుండగా పలువురు భక్తులు ఆసక్తిగా తిలకించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

షార్‌కు చేరిన పీఎస్ఎల్వీ-సీ 59 సామగ్రి

భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన శ్రీహరికోటలోని సతీష్ థావన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి డిసెంబరులో ప్రయోగించే పీఎస్ఎల్వీ-సీ 59 రాకెట్‌కు సంబంధించిన సామగ్రి గురువారం షార్‌కు చేరింది. బెంగళూరు నుంచి రోడ్డు మార్గాన ప్రత్యేక వాహనంలో సామగ్రిని షార్‌కు తీసుకొచ్చారు. ఇప్పటికే ఈ రాకెట్ ద్వారా రోదసీలోకి పంపే బెల్జియం దేశానికి చెందిన ప్రోబా-3 ఉపగ్రహం రెండు రోజుల క్రితం షార్‌కు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ ప్రయోగానికి సంబంధించిన ఏర్పాట్లు షార్‌లో శరవేగంగా జరుగుతున్నాయి. డిసెంబరు 5న షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ-సీ 59 రాకెట్ ప్రయోగం చేపట్టేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి



ఇంటర్వ్యూ

యాదాద్రి ఆలయ పునర్నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన విశ్వకర్మ ఆనంద్‌సాయి టీటీడీ పాలకమండలి సభ్యుడయ్యారు. శంషాబాద్ సమీపంలోని రామానుజాచార్యుల ఆశ్రమ రూపకల్పనలోనూ ఆయనది ప్రధాన పాత్ర. నిజానికి ఆయన సినిమా ఆర్ట్ డైరెక్టర్. తొలిప్రేమ సినిమా కోసం ఏకంగా తాజ్‌మహల్‌నే సముద్రపు ఒడ్డున ప్రతిష్ఠించిన నిపుణుడు. యమదొంగ, సైనికుడు, గుడుంబా శంకర్, బాలు, బృందావనం, నాని, బద్రీనాథ్ వంటి వందకు పైగా సినిమాలకు కళాదర్శకుడిగా వ్యవహరించారు. ఆగమ శాస్త్రాన్ని అధ్యయనం చేసిన వాస్తుశిల్పి. పవన్ కల్యాణ్‌కి సన్నిహిత మిత్రుడు. తిరుమల రూపురేఖలను తన కళానేత్రంతో దర్శిస్తున్న ఆనంద్‌సాయితో ఆంధ్రజ్యోతి సంభాషణ...

- తిరుమల, ఆంధ్రజ్యోతి

పురా సౌందర్యవనంలా తిరుమల



ఆనందసాయి, టీటీడీ బోర్డు సభ్యుడు

"గతంలో తిరుమల ఆలయం ముందు తొలగించిన వెయికాళ్ల మండపానికి పురాతన చరిత్ర ఉంది. దాన్ని మరొక ప్రదేశంలో ఏర్పాటు చేసి ఉంటే బాగుండేది. ఆ దిశగా కూడా ఆలోచనలు చేస్తాం."

40 ఏళ్ల తర్వాత వచ్చిన విశ్వకర్మను

ఇది పెద్ద బాధ్యత. దేవుడి అనుగ్రహం. స్వామివారే డిప్యూటీసీఎం ద్వారా ఈ అవకాశాన్ని నాకు కల్పించారు. దాదాపు 40 ఏళ్ల తర్వాత టీటీడీ బోర్డులోకి విశ్వకర్మగా వచ్చింది నేనే. మనం చేసేది మనం చేయాలి. మిగతాది దేవుడే చేస్తాడు. నాతో చేయించుకుంటాడు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్.. ఇద్దరూ చాలా క్రియేటివ్. వారి ఆధ్వర్యంలో ఒక అత్యద్భుత ఆధ్యాత్మిక వాతావరణం తిరుమలలో సాకారం అవుతుందనే నమ్మకం ఉంది. తిరుమలలో ఇప్పటికే అద్భుతమైన ఆర్కిటెక్చర్ ఉంది. దీంతో పాటు శ్రీవారి ఆలయానికి చుట్టుపక్కల ఉన్న ప్రాంతాలను అభివృద్ధి చేయాలి.

"నాది సంపాదించి, కుటుంబాన్ని బాగా చూసుకోవాల్సిన వయస్సు. అయినా స్వామి కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పనిచేస్తా. భయంతో, భక్తితో చేసే పని మంచి ఫలితాలనే ఇస్తుంది."

క్యూలైన్‌లలో కళా ప్రదర్శనలు

స్వామి దర్శనానికి 24 గంటలు, ఒక్కోసారి మూడు రోజులు కూడా నిరీక్షిస్తున్న సందర్భాలు ఉన్నాయి. క్యూలైన్లలో ఉండేవారు మానసికంగా ఒత్తిడికి గురవుతారు. దాన్ని తొలగించగలగాలి. క్యూలైన్లలో చిన్న చిన్న ఆడిటోరియంలు నిర్మించాలి. భరతనాట్యం, కూచిపూడి, హరికథలు, వాయిద్య కళాప్రదర్శనలు ఏర్పాటు చేయాలి. స్వామివారి వైభవం, తిరుమల విశిష్టత, చరిత్ర వంటి అంశాలను యానిమేటెడ్ వీడియోలుగా రూపొందించి చూపించాలి. పిల్లల కోసం ప్రత్యేకంగా కథలు రూపొందించి ప్రదర్శించాలి. నిరీక్షణ సమయాన్ని ఉల్లాసంగా మార్చగలగాలి.

విజయనగర రాజ్యంలా తిరుమల

తిరుమల చాలా పవర్‌ఫుల్ ఎనర్జీ ఉన్న ప్రదేశం. ఇక్కడ మోడరన్ బిల్డింగులు ఎందుకు? పురాతన సంప్రదాయాలను మళ్లీ తీసుకురావాలి. ఆ సౌందర్యం తిరుమలలో కనిపించాలి. తిరుమలకు వచ్చే వారందరికీ గొప్ప ఫీల్ రావాలి. కొండెక్కగానే చెప్పులు వదిలేసేలా ఉండాలి. శ్రీకృష్ణదేవరాయల కాలాన్ని గుర్తుచేసేలా తిరుమలను అభివృద్ధి చేయచ్చు. విజయనగర రాజ్యం గుర్తుకు రావాలి. దేశవ్యాప్తంగా పేరుపొందిన ఆర్కిటెక్చర్లు చాలా మంది ఉన్నారు. వారి సాయం తీసుకోవచ్చు. అలా మారిస్తే రాబోయే తరాలకు మంచి చరిత్ర ఇచ్చినవారమవుతాము. తిరుపతికి మన పిల్లలను తీసుకెళితే మాకు మంచి కల్చర్ వస్తుందనే అభిప్రాయాన్ని భక్తుల్లో తీసుకురావడమనదే నా కల. దర్శనాలు, వసతి, ప్రసాదాలకు క్రియేటివిటీ జతైతే భక్తులకు గొప్ప అనుభూతులు లభిస్తాయి.

"యాదాద్రి చేసే సమయంలో వచ్చినంత సపోర్ట్ తిరుమల అంజనాద్రికి రాలేదు. ఇక్కడ సిస్టమ్ చూసి భయపడి వెళ్లిపోయా. తిరుమలలో ఏం చేయలేకపోయాననే చాలా కాలం బాధపడ్డాను. టీటీడీ ఇంజినీరింగ్ విభాగాన్ని చాలా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరముంది."

నడకదారి తీరు మారాలి

పవన్‌కల్యాణ్‌తో కలిసి తిరుమలకు నడచి వస్తున్నపుడు ఆయన కొన్ని సూచనలు చేశారు. నడకదారిని అభివృద్ధి చేయాలన్నారు. అలిపిరి నుంచి తిరుమల వరకు ఉన్న నడక మార్గంలో కొంత స్టోన్ వర్క్ చేయాలి. ప్రత్యేకంగా కొన్ని మండపాలు, విశ్రాంతి సముదాయాలు ఉండాలి. ముఖ్యంగా గ్రీనరీని పెంచాలి. అలిపిరి దారిలో నడుస్తూ ఉంటే ఫారెస్ట్ ఫీల్ రావడం లేదు. కొంత ఆర్టిఫిషియల్ పార్ట్‌ను క్రియేట్ చేయాలి. ఈ మార్గంలో ఉన్న అతిపురాతన కట్టడాలు, గోపురాలను సంరక్షించుకోవాలి.



మన్నారుపోలూరు వద్ద సబ్ స్టేషన్ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నెలవల, జేసీ, ఆర్డీవో తదితరులు

జిల్లాకు రెండు 132 కేవీ సబ్‌స్టేషన్లు

- వర్చువల్‌గా శంకస్థాపన చేసిన సీఎం చంద్రబాబు
- తూకివాకం, మాంబట్టులో నిర్మాణం

తిరుపతి కలెక్టరేట్/సూళ్లూరుపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం తూకివాకం, తడ మండలం మాంబట్టులో రెండు 133 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్ల నిర్మాణానికి గురువారం శంకుస్థాపన జరిగింది. గుంటూరు జిల్లా నుంచి సీఎం చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తూకివాకానికి సంబంధించి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటేశ్వర్, సదరన్ డిస్కం సీఎండీ సంతోష్ రావు, ట్రాన్స్‌కో ఎస్ఈ కరుణాకర్, ఎస్ఈ సురేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు. తూకివాకం వద్ద 133 కేవీ విద్యుత్తు స్టేషన్ ఏర్పాటుతో తిరుపతి అర్బన్, రూరల్, రేణిగుంట మండలాల్లోని 50 వేల మంది వినియోగదారులు లబ్ధి పొందనున్నారని కలెక్టరు తెలిపారు. తిరుపతి ప్రాంతంలో గృహ, వ్యవసాయ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతుందన్నారు. వోల్టేజ్ హెచ్చుతగ్గుల సమస్య పరిష్కారం అవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో తూకివాకం జడ్పీటీసీ సుబ్రహ్మణ్యం రెడ్డి, సర్పంచ్ శివ, ట్రాన్స్‌కో ఈఈలు శ్రీనివాస్, సురేంద్ర నాయుడు, డీఈలు, ఏడీఈలు తదతరులు పాల్గొన్నారు.

- సూళ్లూరుపేటలోని మన్నారుపోలూరు 220 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో గురువారం తడ మండలం మాంబట్టులో నిర్మాణం చేపట్టనున్న 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌కు వర్చువల్ పద్ధతిలో సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. రూ.43.53 కోట్లతో మాంబట్టు పారిశ్రామిక వాడలో 5 ఎకరాల విస్తీర్ణంలో ఈ సబ్ స్టేషన్ నిర్మాణం చేపట్టనున్నారు. సీఎం వర్చువల్‌గా శంకుస్థాపన చేశాక జేసీ శుభం బన్సాల్ చేతుల మీదుగా మన్నారుపోలూరులో శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, ఆర్డీవో కిరణ్మయి, ట్రాన్స్‌కో ఎస్ఈ శేషా రెడ్డి, ఈఈ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, ఏజీ కిషోర్, మాధవనాయుడు, తడ ఎంపీపీ రఘురెడ్డి, డీఈ బలరామ్మూర్తి, ఏడీఏ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

20.8 కిలోల గంజాయి స్వాధీనం..నలుగురి అరెస్టు

తడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గంజాయిని అక్రమంగా తరలిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్టుచేశారు. డీఎస్పీ చెంచుబాబు మీడియాకు ఆ వివరాలు వెల్లడించారు. గురువారం శ్రీసిటీ జీరో పాయింట్ వద్ద నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా ఉన్నారని పోలీసులకు సమాచారం అందింది. సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ కొండపనాయుడు వెంటనే అక్కడికి చేరుకుని వారిని విచారించారు. వారు పొంతనలేని సమాధానాలు చెప్పడంతో అదుపులోకి తీసుకున్నారు. వారి బ్యాగులను తనిఖీ చేయగా 20.8కిలోల గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేశారు. అంతర్‌రాష్ట్ర స్మగ్లర్లుగా గుర్తించారు. శ్రీకాకుళం నుంచి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు తేలింది. నిందితులు తమిళనాడు రాష్ట్రం మధురాంతకానికి చెందిన దేవరాజ్ అలియాస్ దేవ, నరేష్ అలియాస్ రాకేష్, తిరువళ్లూరు జిల్లా కామరాజపురానికి చెందిన హరిహరన్ మార్షన్ అలియాస్ హరి, బెంగళూరు కేఆర్‌పురానికి చెందిన నారాయణగా గుర్తించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ కొండపనాయుడు, ఇతర సిబ్బందిని అభినందించారు. అలాగే వారం రోజుల క్రితం 48 కేజీల గంజాయి, నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారని ఈ రెండు కేసుల్లో ప్రతిభ కనబరిచిన వారికి రివార్డు కోసం ప్రభుత్వానికి సిఫారసు చేస్తున్నట్లు డీఎస్పీ చెంచుబాబు వెల్లడించారు.



పట్టుబడ్డ గంజాయి, నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ చెంచుబాబు

గల్లా ఇంటికి టీటీడీ ఛైర్మన్



తిరుపతి, నవంబరు7(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు గురువారం అమరరాజ కంపెనీ వద్దగల మాజీ మంత్రి గల్లా అరుణకుమారి ఇంటికి వెళ్లారు. అరుణకుమారితో పాటు అమరరాజ గ్రూప్స్ అధినేతలు గల్లా రామచంద్ర నాయుడు, గల్లా జయదేవ్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం టీటీడీ ఛైర్మన్‌ను గల్లా కుటుంబ సభ్యులు సత్కరించారు. ఇటీవల విడుదలైన గల్లా అరుణకుమారి స్వీయ చరిత్ర పుస్తకాన్ని బీఆర్ నాయుడు కొనుగోలు చేశారు. పుస్తకాలు అమ్మడం ద్వారా వచ్చే మొత్తాన్ని పేద విద్యార్థుల చదువు కోసం ఉపయోగించాన్న అరుణకుమారి నిర్ణయాన్ని ఆయన అభినందించారు. అనంతరం టీటీడీ పాలకమండలి సభ్యుడు ఓవీ రమణ నివాసానికి బీఆర్ నాయుడు వెళ్లి మర్యాదపూర్వకంగా పలకరించారు.

పాఠశాలల్లో విధిగా స్కౌట్, గైడ్ యూనిట్స్

విద్యాశాఖాధికారి కేవీఎస్ కుమార్



తిరుపతి అర్బన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో స్కౌట్, గైడ్ యూనిట్స్ విధిగా ఏర్పాటు చేస్తామని డీఈఓ కేవీఎస్ కుమార్ అన్నారు. మంగళం జిల్లా పరిషత్ ఉన్నత (ట్రెండ్స్) పాఠశాలలో గురువారం స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ మాట్లాడుతూ 2024-25వ సంవత్సరంలో జిల్లాలో 1,500 పాఠశాలల్లో స్కౌట్ శాఖలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. తిరుపతి జిల్లాలో 40పాఠశాలలకు రూ.50వేల చొప్పున సమగ్రశిక్ష ద్వారా నిధులు ఇవ్వడమే కాకుండా ప్రత్యేక కార్యచరణతో శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం బేస్‌బాల్ క్యాంపు క్రీడాకారులను అభినందించారు. జిల్లా వయోజన వనరుల కమిషనర్ ఎం.ఎం.రెడ్డి, కార్యదర్శి జయరాం వార్షిక నివేదిక సమర్పించి, ఫ్లాగ్ డే స్టిక్కర్లను విడుదల చేశారు. నిర్వాహక కమిషనర్ కోటేశ్వరరావు స్కౌట్ అధికారులను సత్కరించారు. మాస్టర్స్ అడ్వాన్స్ కోర్స్ చేసిన వారికి గుర్తింపు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం భాస్కర్‌నాయుడు, జయరామయ్య, మునిరత్నం, వెంకటేశు, రామకృష్ణ, వెంకటాద్రి, మురళి, హేమకుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఎస్వీయూలో యువ తరంగ్

- మూడు రోజుల పాటు సాంస్కృతిక పోటీలు, ప్రదర్శనల హోరు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు



యువతరంగ్ లోగో

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ వేదికగా శుక్రవారం నుంచి యువ తరంగ్-2024 కార్యక్రమం నిర్వహించనున్నారు. యూనివర్సిటీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో విద్యార్థుల్లోని సృజనాత్మక కళలను వెలికి తీసే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. విజేతలను జాతీయ పోటీలకు తీసుకెళ్లనున్నారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్లను వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ అప్పారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు, వర్సిటీ కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి తదితరులు ఆవిష్కరించారు. యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కళాశాలల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. వారికి అవసరమైన రవాణా, భోజనం, వసతి, వేదికలు వంటి సదుపాయాలు సిద్ధం చేసినట్లు తెలిపారు. డ్యాన్స్, మ్యూజిక్, లిటరరీ ఈవెంట్స్, థియేటర్ ఈవెంట్స్, ఫైన్ ఆర్ట్స్ ఇలా ఐదు విభాగాలుగా 27 ఉప అంశాలపై పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే 35 కళాశాలలకు చెందిన విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం వరకూ నమోదుకు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటలకు అన్నమయ్య భవన్ నుంచి మెయిన్ బిల్డింగ్, ఓల్డ్ ఎంబీఏ బిల్డింగ్, శ్రీవారి ఆలయం, పరిపాలనా భవనం మీదుగా శ్రీనివాస ఆడిటోరియం దాకా ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభిస్తారని, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, శాప్ ఛైర్మన్ రవినాయుడు అతిథులుగా పాల్గొంటారన్నారు. అకడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కల్యాణ్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, ప్రిన్సిపాళ్లు సుధారాణి (ఆర్ట్స్), రామకృష్ణారెడ్డి (సైన్స్), నరసయ్య (కామర్స్), దామోదర రెడ్డి (ఇంజినీరింగ్), డాక్టర్ రంజిత్ కుమార్ పాల్గొన్నారు.



అర్హులందరికీ ఉచిత గ్యాస్

- వెంటనే ఈకేవైసీ చేసుకోవాలన్న జేసీ

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తామని జేసీ శుభం బన్సల్ చెప్పారు. తన చాంబరులో గురువారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉచిత గ్యాస్ కనెక్షన్ల కోసం ఇది వరకే గ్యాస్ కనెక్షన్ కలిగి వుండాలని, ఆధార్, రేషన్ కార్డు తప్పనిసరిగా వుండాలన్నారు. ఈకేవైసీ చేయకుంటే సబ్సిడీ డబ్బులు అకౌంటులో పడవన్నారు. దీనికోసం ఆఖరు తేదీ అంటూ ఏమీ లేదని గ్యాస్ పంపిణీదారులు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వచ్చి ఈకేవైసీ చేసుకుంటారని చెప్పారు. ఎవరూ గ్యాస్ ఏజెన్సీల వద్దకు వెళ్లాల్సిన పనిలేదన్నారు. వచ్చే ఏడాది మార్చి 31 వరకు ఉచిత గ్యాస్ సిలిండర్ల కోసం బుక్ చేసుకోవచ్చన్నారు. ఈకేవైసీ పూర్తయిన వారికి వారి అకౌంట్లలో నగదు జమవుతుందని జేసీ పేర్కొన్నారు. వీటిపై సందేహాలుంటే 1967కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవాలన్నారు.

జీవీఆర్ పరిశ్రమలపై ఐటీ దాడులు

కోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోట మండలం చిట్టేడులోని జీవీఆర్ (సాగర్‌గ్రంధి ఎక్స్‌పోర్ట్) రొయ్యల పరిశ్రమలో గురువారం ఆదాయపన్నుశాఖ అధికారులు తనిఖీలు చేశారు. సిబ్బంది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని ఈ తనిఖీలు చేపట్టారు. ఈ రొయ్యల పరిశ్రమ మాజీ సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితుడు, భీమవరానికి చెందిన మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ది. ఈయనతో పాటు, వారి కుటుంబసభ్యులకు చెందిన 11 పరిశ్రమల్లోనూ ఆదాయ పన్నుశాఖ అధికారులు ఏకకాలంలో సోదాలు చేస్తున్నట్లు సమాచారం.

పుష్పయాగానికి నేడు అంకురార్పణ

తిరుమల, నవంబరు7(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో శనివారం జరుగనున్న పుష్పయాగానికి శుక్రవారం అంకురార్పణ జరుగనుంది. రాత్రి 8 నుంచి 9 గంటల మధ్య అంకురార్పణ నిర్వహించి ఆచార్య రుత్విక్‌వరణం చేపట్టనున్నారు. శనివారం శ్రీవారి ఉత్సవమూర్తులను ఆలయంలోని సంపంగి ప్రదక్షిణంలోని కల్యాణమండపానికి వేంచేపు చేసి స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1 నుంచి 5 గంటల వరకు వివిధ రకాల పుష్పాలు, పత్రాలతో వేడుకగా పుష్పయాగాన్ని చేపట్టనున్నారు.

హత్యాయత్నం కేసులో ఆటోడ్రైవర్ అరెస్టు



శ్రీకాళహస్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో మునికుమార్ అనే ఆటో డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ గోపి కథనం మేరకు... శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన మునికుమార్, అతడి స్నేహితుడు సతీష్‌కుమార్ ఆటో డ్రైవర్లుగా జీవనం సాగిస్తుంటారు. మద్యం మత్తులో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దాంతో ఆగ్రహించిన మునికుమార్ కత్తి వెంటపెట్టుకుని ఈనెల 4వ తేదీన ఉదయం 4 సమయంలో సతీష్ కుమార్ ఇంటి వద్దకు వెళ్లి తలుపు కొట్టాడు. వెలుపలకు వచ్చిన సతీష్‌పై కత్తితో హత్యాయత్నానికి పాల్పడ్డాడు. అడ్డువచ్చిన అతడి భార్య కీర్తన, మామ గణేష్‌లను కత్తితో గాయపరిచాడు. వారి ఫిర్యాదు సీఐ గోపి హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం ముక్కంటి ఆలయ సమీపంలోని సన్నిధి వీధిలో టూరిస్టు బస్టాండు వద్ద మునికుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. అనంతరం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.10 లక్షలు టోకరా

నాయుడుపేట టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.10 లక్షలు టోకరాపెట్టిన సంఘటన నాయుడుపేటలో చోటుచేసుకుంది. నాయుడుపేట-మేనకూరులోని నివాసం ఉంటున్న సాయి అనే యువకుడికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ కడపకు చెందిన యువకుడు నమ్మబలికాడు. దీంతో ఆ యువకుడికి సాయి రూ.10 లక్షలు ఇచ్చారు. ఉద్యోగం ఇప్పించకపోగా, అతడి నుంచి ఎలాంటి సమాధానం లేకపోవడంతో బధితుడు గురువారం నాయుడుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.86 కోట్లు

తిరుమల, నవంబరు7(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.86 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయ వివరాలను టీటీడీ గురువారం ఉదయం ప్రకటించింది. బుధవారం 66,168 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 25,299 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

ఎస్వీయూకు ప్రపంచ గుర్తింపు

- క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో రాష్ట్రంలో మొదటి స్థానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీకి ప్రపంచ స్థాయి గుర్తింపు లభించింది. క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్స్-2025లో 581-600 మధ్య ర్యాంకు సాధించింది. ఆంధ్రప్రదేశ్‌లోని యూనివర్సిటీలన్నింటిలో మొదటి స్థానాన్ని పొందింది. పరిశోధనలు, నూతన ఆవిష్కరణలు, ఉపాధి కల్పన, అంతర్జాతీయ సంబంధాలు తదితర అంశాల్లో ప్రమాణాలను పరిశీలించి ఈ గుర్తింపును ప్రకటించారు. ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు హర్షం వ్యక్తం చేశారు. అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, ఉద్యోగుల సమష్టి కృషితోనే ఈ గుర్తింపు సాధ్యమైందన్నారు.

అండర్ పాస్ అటకెక్కిందా?

పలమనేరు, నవంబరు7 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు సమీపంలో జాతీయ రహదారిపై తరచూ రోడ్డు దాటుతున్న ఏనుగుల కోసం మూడు చోట్ల అండర్ పాస్ బ్రిడ్జిల నిర్మాణం అటకెక్కినట్లేనా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. గతేడాది అక్టోబరులో ఈ జాతీయ రహదారిపై గాంధీనగర్ సమీపంలో రోడ్డు దాటుతున్న మూడు ఏనుగులను పలమనేరు నుంచి చిత్తూరు వెళ్లే మినీ లారీ వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. దీంతో అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని ఏనుగుల కళేబరాలను రోడ్డు పక్కకు జరిపించి పోస్టుమార్టం చేసి అటవీ ప్రాంతంలోనే ఖననం చేశారు. కౌండిన్య శాంచురీలో ఉన్న ఏనుగులు ఆహారం కోసం సంచరించే సమయంలో జాతీయ రహదారిని దాటుతున్నాయి. ఇలా దాటే సమయంలో పలుసార్లు వాహనచోదకులు తమ వాహనాలు నిలిపివేసి ఏనుగులు వెళ్లిన తరువాత వెళ్లిపోతున్నారు. కేవలం 6కిలోమీటర్ల దూరంలో ఏనుగులు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతంలోని అడవికి ఈ రహదారి దాటి వెళ్తున్నాయి. అప్పటి జిల్లా అటవీశాఖ అధికారి ఏనుగులు తరచూ జాతీయరహదారి దాటే ప్రదేశాలను గుర్తించి అండర్‌పాస్ బ్రిడ్జిల నిర్మాణం చేపడతామని ప్రకటించారు. ఇందుకోసం జాతీయ రహదారి (ఎన్‌హెచ్ఏఐ) అధికారులు తమ నిధులనుంచి దాదాపు రూ.10కోట్లు పైనే అటవీశాఖకు అందజేస్తారని కూడా అప్పట్లో ప్రకటించారు. ఈ జాతీయ రహదారికి కేవలం ఫర్లాంగు దూరంలోనే చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే కూడా నిర్మిస్తున్నారు. దీంతో అటవీ ప్రాంతంలో అలజడి పెరగడంతో అడవిలోని వన్యప్రాణులు అటవీలోతట్టు ప్రాంతానికి వెళ్లే క్రమంలో ఈ జాతీయ రహదారిని కూడా ఒక్కోసారి దాటుతున్నాయి. అధికారులు చెప్పిన విధంగా పలమనేరు సమీపంలోని గాంధీనగర్, బూతలబండ, జగమర్ల క్రాస్ వద్ద అండర్ పాస్ బ్రిడ్జిలు నిర్మిస్తే ఏనుగులతో పాటు వన్యప్రాణులు సైతం అడవిలోని ఒకవైపు నుంచి మరోవైపు సులభంగా వెళ్లే అవకాశాలున్నాయి. ఇకనైనా జిల్లా అధికారులు గతంలో ఉన్న ప్రతిపాదనను కార్యరూపం దాల్చి అండర్‌పాస్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టి వన్యప్రాణులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.


గతేడాది పలమనేరు సమీపంలో మినీ లారీ ఢీకొనడంతో చనిపోయిన మూడు ఏనుగులు (ఫైల్ ఫొటో)

ఈ అమ్మకు తోడెవరు?



వయసు మీద పడింది. తన పని తాను చేసుకోలేని నిస్సహాయస్థితి ఆమెది.కన్నబిడ్డలు లేరు.బంధువులు కూడా దరిచేర్చకపోవడంతో నిత్యకృత్యాలు తీర్చుకోవడానికి ఇబ్బందులు పడుతోందీ నాగమ్మ.పెళ్లితో వెదురుకుప్పం మండలం పాతగుంట ఆదిఆంధ్రవాడకు చేరిన నాగమ్మ(70) భర్తతో ఏర్పడిన విబేధాలతో కొంత కాలానికే ఇల్లు వదిలింది.బంధువుల ఇళ్ల వద్ద తలదాచుకుంటూ వచ్చింది. ఇదే మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయతీ కొమ్మిండ్లులో కొంతకాలం,గంగాధరనెల్లూరు మండలంలోని ఎస్ఎస్‌కొండ సమీపంలో వున్న తన చెల్లెలి ఇంటి వద్ద కొంతకాలం వుంటూ వచ్చింది.కొమ్మిండ్లులో లేకపోయినప్పటికీ చాలాకాలంగా ఆమెకు ఒంటరి మహిళ కింద పెన్షన్ వస్తోంది.వయసు మీదపడడంతో ఎవరూ ఆదరించక చివరికి కొమ్మిండ్లుకు చేరింది నాగమ్మ. అక్కడా ఉండడానికి ఇల్లు లేకపోవడంతో గ్రామానికి సమీపంలోని పాలశీతలీకరణ కేంద్రం వరండాలో తలదాచుకుంటోంది.గ్రామానికే చెందిన ఓ హోటల్ యజమానికి తనకొస్తున్న పెన్షన్ సొమ్ములో నెలకు రూ.1500 ఇస్తుండడంతో మూడు పూటలా తిండి పెడుతున్నాడు. అయితే నిత్యకృత్యాలు తీర్చుకోవడానికి శక్తిలేక ఇబ్బందులు పడుతోంది.ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తోంది.



- వెదురుకుప్పం, ఆంధ్రజ్యోతి

చిరుత దాడిలో పాడి ఆవు మృతి


పులి దాడిలో మృతి చెందిన పాడి ఆవు

చౌడేపల్లె, నవంబర్7 (ఆంధ్రజ్యోతి) : చిరుత దాడిలో పాడి ఆవు మృతి చెందిన ఘటన చౌడేపల్లె మండలంలో గురువారం సాయంత్రం జరిగింది. బాధితుల కథనం మేరకు .. చుక్కావారిపల్లెకు చెందిన నాగరాజ తన పాడి ఆవులను గ్రామ చివరిలోని అటవీ ప్రాంతానికి మేత కోసం తీసుకెళ్లాడు. సాయంత్రం అకస్మాత్తుగా చూస్తుండగానే పాడి ఆవుపై చిరుత దాడి చేసింది. ఆయనతోపాటు తోటి పశువుల కాపరులు గట్టిగా అరిచి చిరుతను తరిమేశారు. చిరుత అడవిలోకి వెళ్లినట్లు వెళ్లి తిరిగి మళ్లీ రెండవసారి వచ్చి ఆవుపై దాడి చేసి పొదల్లోకి ఈడ్చుకెళ్లి చంపేసింది. ఈ దాడిలో సుమారు రూ.80 వేలు విలువ చేసే ఆవు మృతి చెందిందని, ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలన్నారు. చిరుత దాడిలో ఆవు మృతి చెందినట్లు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించినట్లు బాధితుడు తెలిపారు.

9 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో తొమ్మిది మండలాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. మండలాలవారీగా.. కార్వేటినగరంలో 16.2, శ్రీరంగరాజపురంలో 8, పాలసముద్రంలో 6.2, గంగాధరనెల్లూరులో 6, చిత్తూరు అర్బన్‌లో 5, గుడిపాలలో 4.2, చిత్తూరు రూరల్‌లో 4, నగరిలో 2, నింద్రలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

చిత్తూరులో నేటినుంచి 'గరికపాటి' ప్రవచనాలు

చిత్తూరు కల్చరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో శుక్ర, శని, ఆదివారాల్లో ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహరావు.. యోగవాసిష్ఠం ప్రవచనాల కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు నారాయణీ సేవాసమితి నిర్వాహకుడు కళ్యాణ చక్రవర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ సాయంత్రం ఆరు నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ


ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌పై విజయం.. స్క్రీనింగ్‌తో సాధ్యమని డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి అన్నారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీని చిత్తూరు ప్రభుత్వాస్పత్రి నుంచి గాంధీవిగ్రహం వరకు నిర్వహించారు. ఈనెల 14వ తేదీ నుంచి ప్రతి గ్రామంలో ఇంటింటి క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. జిల్లా టీబీ నివారణ అధికారి వెంకటప్రసాద్, ఎంహెచ్‌వో లోకేష్, డాక్టర్ శిరీష, అపోలో విద్యార్థులు పాల్గొన్నారు.

సారా ఊట ధ్వంసం

నగరి/గుడిపాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు చోట్ల 1,200 లీటర్ల సారా ఊటను పోలీసులు ధ్వంసం చేశారు. నగరి మండల పరిధిలోని అడవికొత్తూరులో గురువారం నగరి పోలీసులు సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 800 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ మహేశ్వర్ తెలిపారు. ● గుడిపాల మండలంలోని రాసనపల్లె పరిసరప్రాంతాల్లో గురువారం దాడులు నిర్వహించి 400 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. సారా విక్రయించినా, తయారు చేసినా పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు.

టీబీఐ కేంద్రానికి రూ.44 లక్షల మంజూరు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలోని టెక్నాలజీ బిజినెస్ ఇన్‌క్యుబేటర్ (టీబీఐ) కేంద్రానికి రూ.44 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో టీబీఐ ద్వారా మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజని తెలిపారు. నిధుల మంజూరు ఉత్తర్వులు అందినట్లు వారు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

క్వాలిటీ సర్కిల్ ఫోరమ్ ఆఫ్ ఇండియా పోటీలు ప్రారంభం


వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న ప్రతినిధులు

తిరుపతి అర్బన్,నవంబరు7(ఆంధ్రజ్యోతి): ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో గురువారం రాష్ట్రస్థాయి క్వాలిటీ సర్కిల్‌ఫోరమ్ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ 10వవార్షిక క్వాలిటీ పోటీలు ప్రారంభమయ్యాయి. చైర్మన్ జగన్మోహన్ మాట్లాడుతూ గతంలో తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో నిర్వహించే పోటీలకు మంచి గుర్తింపు వచ్చిందన్నారు. సభ్యత్వంలో తిరుపతి చాప్టర్ దేశంలోనే మొదటి మూడు స్థానాల్లో ఉందన్నారు.

'విశ్వకర్మ' లబ్ధిదారులకు రుణాలివ్వండి

● బ్యాంకర్లకు కలెక్టర్ సూచన

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పీఎం విశ్వకర్మ యోజన ద్వారా లబ్ధిదారులకు విరివిగా రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలు నుంచి డీఆర్డీఏ, మెప్మా, ఎల్డీఎం, నైపుణ్యాభివృద్ధి సంస్థ, బ్యాంకు మేనేజర్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సంప్రదాయ పనిముట్లను, చేతివృత్తులను ఉపయోగించి పనిచేసే కళాకారుల కుటుంబ ఆధారిత వృత్తులను బలోపేతం చేయడమే ఈ పథకం ముఖ్యుద్దేశమన్నారు. ఈ పథకం కింద ఐదు శాతం వడ్డీతో తొలివిడత రూ.లక్ష, రెండో విడతలో రూ.2 లక్షలు రుణం అందిస్తారని తెలిపారు. డీఆర్డీఏ, మెప్మా పీడీలు రవికుమార్ నాయుడు, రాధమ్మ, ఎల్డీఎం హరీష్, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గుణశేఖర్ రెడ్డి, డీసీసీబీ జీఎం చంద్రశేఖర్, వివిధ బ్యాంకుల కంట్రోలింగ్ అధికారులు పాల్గొన్నారు.

30లోగా 'విండో'ల్లో కంప్యూటరీకరణ చేస్తాం

● సహకార సంఘాల కమిషనర్‌కు జేసీ వివరణ

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (సింగిల్ విండోల) కంప్యూటరీకరణపై సహకార సంఘాల కమిషనర్, రిజిస్ట్రార్ ఎ.బాబు గురువారం మధ్యాహ్నం అన్ని జిల్లాల జేసీలతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. చిత్తూరు కలెక్టరేట్ నుంచి పాల్గొన్న జేసీ విద్యాధరి మాట్లాడుతూ జిల్లాలోని 37 సింగిల్ విండోల్లో రికార్డుల కంప్యూటరీకరణ పనులు దాదాపు 80శాతం పూర్తయ్యాయని తెలిపారు. సంఘ సభ్యుల కేవైసీ, లోన్లు, డిపాజిట్లు, ఇతర వివరాలను నమోదుచేయడం జరుగుతున్నదని చెప్పారు. ఈనెల 30వ తేదీలోగా అన్ని సంఘాల్లో కంప్యూటరీకరణ పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి నాగవర్ధన, చిత్తూరు డీఎల్సీవో వనజ, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈవో మనోహర్ గౌడ్, బ్యాంకు డీజీఎం చలపతి, ఆప్కాబ్ డిస్ట్రిక్ ప్యాక్స్ డెవలప్‌మెంట్ మేనేజర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఐవోసీఎల్, టీచర్ల సేవలు ప్రశంసనీయం

కె.గొల్లపల్లె పాఠశాలలో నూతన భవనాల ప్రారంభోత్సవంలో కలెక్టర్


శిలాఫలకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ సుమిత్‌కుమార్

యాదమరి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఐవోసీఎల్ సంస్థ, టీచర్ల సేవలు ప్రశంసనీయమని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. కె.గొల్లపల్లె హైస్కూల్ ప్లస్‌లో నూతనంగా నిర్మించిన అధునాతన వంటశాల, డైనింగ్ హాల్, మరుగుదొడ్లను డీఈవో వరలక్ష్మి, డీవైఈవో చంద్రశేఖర్, ఐవోసీఎల్ ప్రతినిధులు, ఎంఈవో రుక్మిణి, హెచ్ఎం ఏపీ లలితతో గురువారం మధ్యాహ్నం కలిసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బాగా చదువుకుని.. ఉన్నత శిఖరాలకు ఎదగాలని పిలుపునిచ్చారు. పాఠశాలలో మౌలిక వసతులు లేకపోవడంతో హెచ్ఎం, ఉపాధ్యాయులు ఐవోసీఎల్ సంస్థను సంప్రదించి, రూ.50 లక్షలతో అధునాతన వంటగది, డైనింగ్ హాలు, మరుగుదొడ్లను ఏర్పాటు చేశారన్నారు. ఐవోసీఎల్ డీజీఎం అమితాబ్ సర్దార్, కైలాష్ కాంత్, అరుణ్ ప్రసాద్, ఎంపీడీవో వేణు, తహసీల్దార్ పార్థసారథి, ఉపాధ్యాయులు కనకాచారి, మదన్‌మోహన్ రెడ్డి, నరసింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏం జరిగిందో?

చెరువులో శవమైన వృద్ధుడు - అనుమానాస్పద మృతి కేసుగా నమోదు


సుబ్బరామయ్య మృత దేహం

వెదురుకుప్పం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బైకుల్లో వెంట తీసుకెళ్లారు. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు. గురువారం చెరువులో ఓ వృద్ధుడు శవమై తేలాడు. ఈ ఘటన వెదురుకుప్పం మండలంలో జరిగింది. ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు.. వెదురుకుప్పం మండలం దిగువపల్లాలుకు చెందిన మహేష్ మామిడి తోటలో అదే గ్రామంలోని సుబ్బరామయ్య(65) ఐదేళ్లుగా పనిచేస్తున్నాడు. బుధవారం సాయంత్రం మహేష్, అతడి వర్గీయులు రామకృష్ణారెడ్డి, నరసింహారెడ్డి కలసి సుబ్బరామయ్యను బైక్‌ల్లో గొడుగుచింత గ్రామ సమీపంలోని రంగారెడ్డి చెరువులో చేపలు పట్టడానికి తీసుకెళ్లారు. సుబ్బరామయ్య నీట మునిగిపోవడంతో అక్కడినుంచి ముగ్గురూ వెళ్లిపోయారు. రాత్రి వృద్ధుడి భార్యకు సమాచారం ఇచ్చారు. మృతుడి కుమారుడు మునెయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. శుక్రవారం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అయ్యాక మృతదేహాన్ని బంధువులకు అప్పగిస్తామని ఎస్ఐ చెప్పారు. పోస్టుమార్టం నివేదిక వచ్చాక నిజాలు తెలుస్తాయన్నారు. ఈ ఘటనపై స్థానికంగానూ పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

భూవివాదంలో ఐదుగురిపై కేసు నమోదు

పెనుమూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భూ వివాదంలో ఐదుగురిపై కేసు నమోదైంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. శాతంబాకం పంచాయతీ పెద్దిరాజుపల్లికి చెందిన రాజారెడ్డి అనే రైతు అదే గ్రామానికి ప్రవీణ్ కుమార్‌రెడ్డి దగ్గర రెండెకరాల భూమిని లీజుకు.. సేల్ అగ్రిమెంట్ రూపంలో రూ.16లక్షల 20వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. రూ.తొమ్మిది లక్షల ఇరవై వేలను చెల్లించాడు. రిజిస్ట్రేషన్ సమయంలో మిగిలిన మొత్తం చెల్లిస్తామని రాజారెడ్డి తెలిపాడు. డబ్బు తీసుకున్న ప్రవీణ్, అగ్రిమెంట్ సమయం పూర్తవుతున్న సందర్భంగా భూమిని తనకు విక్రయించక పోవడంతో రాజారెడ్డి కోర్టును ఆశ్రయించాడు. కోర్టులో కేసు నడుస్తున్న భూమిలోకి గురువారం ప్రవీణ్ దౌర్జన్యంగా ప్రవేశించి, కూసాలు నాటాలని చూశాడు. అడ్డుకోబోయిన తమపై దాడి చేశాడని రాజారెడ్డి భార్య వనజాక్షి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రవీణ్ కుమార్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డిలపై కేసు నమోదు చేశామని రైటర్ మధు తెలిపారు.

బైక్‌నుంచి పడి యువకుడి దుర్మరణం

కాణిపాకం(ఐరాల), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ముందు వెళుతున్న వాహనాన్ని ద్విచక్రవాహనంపై ఓవర్‌టేక్ చేయబోయి.. కిందపడిన ఓ యువకుడు దుర్మరణం చెందాడు. తవణంపల్లె మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన నాగ పని నిమిత్తం గురువారం కాణిపాకం వచ్చి తిరిగి స్వగ్రామానికి బయల్దేరాడు. అగరంపల్లె వద్ద ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి కిందపడ్డాడు. తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కాణిపాకం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రీసర్వేలోని అక్రమాలు, తప్పులను సరిదిద్దడానికే గ్రామసభలు : టీడీపీ


మీడియాతో మాట్లాడుతున్న కోదండయాదవ్

చిత్తూరు సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో నిర్వహించిన రీసర్వేలో జరిగిన అక్రమాలు, తప్పులను సరిదిద్దడానికే రెవెన్యూ గ్రామసభలు జరుపుతున్నట్లు చిత్తూరు పార్లమెంటు టీడీపీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ అన్నారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. విస్తీర్ణాలు తగ్గించి, పేర్లు తప్పుగా ముద్రించి పాసుపుస్తకాలను వైసీపీ ప్రభుత్వం పంపిణీ చేసిందని మండిపడ్డారు. ఇవన్నీ కూటమి ప్రభుత్వం సరిచేస్తోందని వివరించారు. ఇక సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులకు శాపంగా, ప్రమాదకరంగా వైసీపీ ప్రభుత్వం తెచ్చిన.. ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దుచేయడం జరిగిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఎప్పుడూ రైతులకు అండగా ఉంటుందని చెప్పారు. నేతలు మోహన్‌రాజ్, వెంకటేష్ యాదవ్, ధరణి ప్రకాష్, సుధాకర్ నాయుడు పాల్గొన్నారు.

వీఆర్‌కు తిరుపతి ఈస్ట్ సీఐ

● విధుల పట్ల నిర్లక్ష్యం.. కేసుల నమోదులో అలసత్వమే కారణం

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులును వీఆర్‌కు పంపుతూ ఎస్పీ సుబ్బరాయుడు గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఈస్ట్ సీఐగా ఆయన బాధ్యతలు స్వీకరించి నెల రోజులే కావడం గమనార్హం. విధుల పట్ల నిర్లక్ష్యం.. కేసుల నమోదులో అలసత్వంతో వ్యవహరించడమే కారణమని తెలిసింది. విధుల్లో చేరినప్పటి నుంచీ ఆయనపై పలు ఆరోపణలు వచ్చాయి. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల అసహనం వ్యక్తం చేయడం, ప్రతి రోజూ నమోదవుతున్న ఎఫ్ఐఆర్‌లను ఉన్నతాధికారులకు తెలియచేయడంలో అలక్ష్యం చూపడం, కొన్ని కేసుల వివరాలు స్టేషన్ జనరల్ డైరీలో ఎంట్రీ చేయకనే నేరుగా బాధితులతో మాట్లాడి రాజీ కుదుర్చుతున్నారనే ఫిర్యాదులు ఎస్పీ దృష్టికి వెళ్లాయి. దీంతో వీటిపై విచారణకు ఆయన ఆదేశించారు. తిరుపతి స్పెషల్ బ్రాంచి అధికారులు విచారించి నివేదిక ఇచ్చారు. దీంతో ఆయన్ను వీఆర్‌కు పంపారు. తక్షణం రిలీవ్ అయి ఎస్పీ వద్ద రిపోర్టు చేసుకోవాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

గత సీఐ కూడా వీఆర్‌కే..

గతంలో ఈస్ట్ సీఐగా పనిచేసిన మహేశ్వరరెడ్డిపై అవినీతి ఆరోపణలు రావడం, టీటీడీ మార్కెటింగ్ జీఎం మురళీకృష్ణ ఇచ్చిన ఫిర్యాదును నమోదు చేయడానికి భయపడి అజ్ఞాతంలోకి వెళ్లడంతో ఆయన్ను వీఆర్‌కు పంపారు. ఆయన స్థానంలో శ్రీనివాసులును నియమించారు. అయితే కొద్ది రోజులకే ఈయనపైనా పలు అవినీతి ఆరోపణలు రావడంతో వీఆర్‌కు బదిలీ చేశారు.

ఈస్ట్ ఇన్‌చార్జి సీఐగా రామకృష్ణ

తిరుపతి ఈస్ట్ ఇన్‌చార్జి సీఐగా వెస్ట్ సీఐ రామకృష్ణను నియమిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన గురువారం ఈస్ట్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఎస్ఐలు, సిబ్బంది స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందచేశారు. అనంతరం డీఎస్పీ వెంకటనారాయణను మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందచేశారు.

మీడియా రంగంలో సాంకేతిక ప్రభావం తీవ్రం

ధర్మనిధి ఉపన్యాసంలో ప్రొఫెసర్ సందీప్


కార్యక్రమంలో పాల్గొన్న మాజీ వీసీ దుర్గాభవాని తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మీడియా రంగంలో సాంకేతిక పరిజ్ఞాన ప్రభావం తీవ్రంగా కనిపిస్తోందని ప్రొఫెసర్ ప్రదీప్ పేర్కొన్నారు. పద్మావతి మహిళా యూనివర్సిటీ జర్నలిజం విభాగంలో నిర్వహించిన సీవీఎస్ శర్మ ధర్మనిధి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మీడియా రంగంలో వస్తున్న సమాచారాన్ని నిర్ణయిస్తోంది యాజమాన్యాలు కాదనీ, పాఠకులని అన్నారు. సమాచారాన్ని చేరవేసే ముందు నిజాన్ని నిర్ధారించుకోవాల్సిన అవసరం మరింత పెరిగిందని అభిప్రాయపడ్డారు. మీడియా రంగం పట్ల ప్రాథమిక స్థాయి నుంచే ఈ తరానికి బోధించాల్సిన అవసరం ఉందన్నారు. పద్మావతి వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ దుర్గాభవాని మాట్లాడుతూ జర్నలిజం విభాగ వ్యవస్థాపక ప్రొఫెసర్‌గా సీవీఎస్ శర్మ ఉన్నత మార్గాన్ని నిర్దేశించారని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీన్లు వాణి, విజయలక్ష్మి, జర్నలిజం విభాగాధిపతి ప్రొఫెసర్ బీఎన్ నీలిమ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎట్టకేలకూ బెంగళూరుకు ఆర్టీసీ సర్వీసులు

పలమనేరు, నవంబరు7(ఆంధ్రజ్యోతి) : పలమనేరు డిపోనుంచి బెంగళూరుకు వారానికి నాలుగు రోజులు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ స్వామి తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 3.45 గంటలకు పలమనేరు నుంచి బయలుదేరి రాత్రి బెంగళూరుకు చేరుకొని అక్కడినుంచి రాత్రి 8.20 గంటలకు బయలుదేరి పలమనేరుకు చేరుకుంటుంది. శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు పలమనేరు నుంచి బయలుదేరి బెంగళూరుకు వెళ్లి అదేరోజు సాయంత్రం 6.30 గంటలకు బెంగళూరులో బయలుదేరి పలమనేరుకు చేరుకొంటుంది.ఇక ఆదివారం సాయంత్రం 4 గంటలకు పలమనేరు నుంచి బయలుదేరి రాత్రి బెంగళూరుకు చేరుకొని అక్కడినుంచి రాత్రి 8.30 గంటలకు బయలుదేరి పలమనేరుకు చేరుకొంటుంది. ఇక సోమవారం ఉదయం 4.45కు పలమనేరు నుంచి బయలు దేరి బెంగళూరుకు చేరుకొని అక్కడి నుంచి మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి పలమనేరుకు చేరుకుంటుందన్నారు. ఈ సర్వీసులు బాగా రద్దీ ఉన్న సమయంలో నడుపుతున్నామని, ఈ సర్వీసులకు రిజర్వేషన్ చేసుకొనే అవకాశం వుందన్నారు.

నైపుణ్య గణన సర్వేకు ప్రజలు సహకరించాలి

కల్లూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాల కల్పనకు చేపట్టబోయే నైపుణ్య గణన సర్వేకు ప్రజలు సహకరించాలని ఎంపీడీవో రాజశేఖర్‌బాబు కోరారు. పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నైపుణ్య గణన సర్వేపై సచివాలయ సిబ్బందికి ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షకులు భరత్‌కుమార్, మురళీకృష్ణ, తులసి మాట్లాడుతూ యువతకు అవసరమైన నైపుణ్యాల్లో శిక్షణనిచ్చి ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ సర్వే ముఖ్య ఉద్దేశమన్నారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి 15 ఏళ్ల నుంచి 59 ఏళ్లలోపు వారి వివరాలు సేకరిస్తారన్నారు. ఇందుకోసం రూపొందించిన యాప్‌లో వివరాలు సేకరించి ఈ డేటాను భద్రపరుస్తారన్నారు. సర్వే పూర్తయ్యాక కంపెనీలు, పరిశ్రమలు ఎలాంటి నైపుణ్యాలు కోరుకుంటున్నాయో గుర్తించి నిరుద్యోగులకు శిక్షణ అందిస్తారన్నారు.

ఓటరు జాబితా సవరణకు ప్రత్యేక శిబిరాలు



బీఎల్వోలతో సమావేశమైన తహసీల్దారు చిట్టిబాబు

కుప్పం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా సవరణకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు కుప్పం తహసీల్దారు చిట్టిబాబు తెలిపారు. తహసీల్దారు కార్యాలయంలో ఆయన బుధవారం బీఎల్వోలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 9, 10 తిరిగి 23, 24 తేదీలలో 4 రోజులపాటు ఈ శిబిరాలు వీఎల్వోల ఆధ్వర్యంలో ఆయా సచివాయాల పరిధిలో జరుగుతాయన్నారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులపై అభ్యంతరాలు స్వీకరించి, సరి చేస్తామన్నారు. ఓటర్ల ముసాయిదా ప్రకటనకు ముందు జరిగే ఈ శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని తహసీల్దారు సూచించారు.

మన బడి అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న కరీముల్లా

సదుం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) బాల్యంలో విద్యాబుద్ధులు నేర్చుకున్న మన బడి అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు తమ వంతు బాధ్యతగా భాగస్వామ్యం కావాలని విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త డా.కరీముల్లా పేర్కొన్నారు. సదుం జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు, విశ్రాంత ఉపాధ్యాయులు సంయుక్తంగా రూ.85 వేలు విలువజేసే సైన్స్ పరికరాలను పాఠశాలకు అందజేశారు. వీరు గతంలోనూ రూ.5 లక్షల వ్యయంతో పాఠశాల భవనానికి కొత్త రంగులు, జాతీయ నాయకుల చిత్రాలను వేయించారు. దాతలు బాబు రెడ్డి, దామోదర్ రెడ్డి, రుక్మాంగద రెడ్డి, రాజారెడ్డి, గుణభూషణ్ రెడ్డి, దుర్వాసులు రెడ్డి, డా.కరీముల్లా, సరస్వతి, శివరామిరెడ్డిలను హెచ్‌ఎం జైకుమార్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించింది.

మాజీ ఎంపీటీసీకి దశ దిన కర్మక్రియలు



పద్మావతమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న పులివర్తి నాని

కల్లూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం వెంకటదాసరపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యురాలు మెరుగు పద్మావతమ్మ దశ దిన కర్మక్రియల్లో గురువారం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పాల్గొన్నారు. గతనెల 26వ తేదీన మెరుగు పద్మావతమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె స్వగ్రామం పులిచెర్ల మండలం ఆర్.కుమ్మరపల్లికి చేరుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని ముందుగా పద్మావతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మృతురాలి భర్త వెంకట్రమణ, కుమారులు ఆనంద్, భాస్కర్, తులసీరాం, బాబు, కుమార్తె గౌరి, అల్లుడు వేణు తదితరులను పరామర్శించారు. నివాళి అర్పించిన వారిలో జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్, టీడీపీ నాయకులు కుమార్ రెడ్డి, మురళీనాయుడు, ధనంజయనాయుడు, రమేష్, నారాయణస్వామినాయుడు, కరుణాకర్ నాయుడు, మోహన్‌దాస్, అబ్బాస్ ఉన్నారు.

పీఈఎస్‌లో రోగులకు పండ్లు, బ్రెడ్ అందజేత



డెఫ్ అండ్ డెమ్ స్కూల్‌లో విద్యార్థులకు అన్నదానం

కుప్పం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పీఈఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు దొరస్వామినాయుడు జన్మదిన వేడుకలను కుప్పం పీఈఎస్ ఆసుపత్రిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్ అందజేశారు. అలాగే శెట్టిపల్లె వద్ద గల డెఫ్ అండ్ డమ్ స్కూల్ విద్యార్థులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో డీన్ అండ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్‌ఆర్.కృష్ణారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరీష్‌కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రమణ్య, అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మోహన్‌రూప, డాక్టర్ శ్రీధర్, హెచ్‌ఆర్ మేనేజర్ రాజ్‌కుమార్, అడ్మిన్ అభిలాష్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 50 మంది ఎంపిక

గంగవరం, నవంబరు07(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 50 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ ఎంవీఆర్ రెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మీసుధ తెలిపారు. గురువారం ఆ కళాశాలలో ఫస్ట్ సోర్స్ అనే కంపెనీ నిర్వాహకులు డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన 50మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు ప్రకటించారు. ఏడాదికి రూ.2.75 లక్షల ప్యాకేజి ఉంటుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

ఊటుపల్లెలో 312 అర్జీలు



సదుం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటుపల్లెలో గురువారం జరిగిన రెవెన్యూ గ్రామసభలో అత్యధికంగా 312 అర్జీలు అందినట్లు డీటీ కుమార్ తెలిపారు. వీటిలో అధికంగా ఒకే సర్వే నెంబరుపై ఇద్దరు, ముగ్గురు పేర్లు నమోదు సమస్యలే ఉన్నాయని ఆయన వివరించారు. వీటన్నింటినీ సర్వేయర్ల ద్వారా పరిశీలించి త్వరలోనే పరిష్కరించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, వీఆర్వో అన్వర్ బాషా, కమ్యూనిటీ, విలేజ్ సర్వేయర్లు నాగభూషణం, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ సభ్యత్వ నమోదును ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి

రామకుప్పం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదును పార్టీ శ్రేణులు ప్రతిష్టాత్మకంగా తీసుకొని జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి కోరారు. గురువారం రామకుప్పం పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సమావేశంలో మాట్లాడుతూ టీడీపీలో సభ్యత్వం తీసుకున్న వారికి రూ.5 లక్షల భీమాతో పాటు, దహన సంస్కారాలకు రూ.10 వేలు ఆర్థికసాయం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో నేతలు పట్రానారాయణ, ఆనందరెడ్డి, నరసింహులు, ఆంజినేయరెడ్డి, చిన్నకృష్ణ, చలపతి, రామమూర్తి, సీతాపతి, విశ్వనాథ్, రామలింగారెడ్డి, కృష్ణానాయక్, మనోహర్, వెంకటరమణ, గజేంద్ర, కామరాజ్‌నాయక్, ఆదిల్, రామకృష్ణ జయశంకర్, పెరుమాల్, విజయ్ కుమార్ రెడ్డి, సురేష్, నియాజ్ తదితరులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సోమల మండల సమావేశం

సోమల, నవంబరు7(ఆంధ్రజ్యోతి) : సోమల మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ ఈశ్వరయ్య అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నారాయణ తెలిపారు. అధికారులు, సర్పంచులు, సభ్యులు సమావేశానికి హాజరు కావాలన్నారు.

ఉపాధి పనులు కల్పించడంలో నిర్లక్ష్యం వద్దు

చల్లా రామచంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు, నవంబరు7(ఆంధ్రజ్యోతి): కూలీలకు జాతీయ ఉపాధి పనులు కల్పించడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఇంటికి వెళ్లడం తప్పదని పుంగనూరు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి హెచ్చరించారు. గురువారం స్థానిక ట్రావెల్స్‌బంగ్లాలో అధికారుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన పనులు గుర్తించి పనులు వేగవంతగా పూర్తి చేయాల్సిన బాధ్యత ఉపాధి సిబ్బంది తీసుకోవాల్సి వుందన్నారు. గ్రామాల నుంచి పొలాల్లోకి రోడ్లు, చేపలు పెంచుకోవడానికి నీటి కుంటలు, పశువుల షెడ్లు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాల్సివుందన్నారు. ప్రతినెల ఉపాధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల కోసం పని చేస్తోందని, ప్రభుత్వ పథకాలను సక్రమంగా ప్రజలకు అందించాలని సూచించారు. ప్రతిపక్ష పార్టీలు ఉనికి కోసం విమర్శలు చేయడం తప్పా చేసేది ఏమీలేదన్నారు. సమావేశంలో ఎంపీడీవో లీలామాధవి, ఏపీవో శివకుమార్, తహసీల్దార్ రాము, కమిషనర్ మధుసూదన్ రెడ్డి, సీఐ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు మాధవరెడ్డి, శ్రీకాంత్, సీవీరెడ్డి, వెంకటముని, రామకృష్ణమరాజు, లక్ష్మీపతిరాజు, సుబ్రహ్మణ్యంరాజు, విరూపాక్షి, గంగాధర్, గంగులప్ప, మణి, బాలాజీ నాయక్, గంగరాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారస్తుల సమస్యల పరిష్కారానికి కృషి

పుంగనూరు పట్టణంలోని కూరగాయల వ్యాపారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక వ్యవసాయ మార్కెట్ ఆవరణలో వ్యాపారులు ఆయనను గజమాలతో సత్కరించారు. వ్యాపారస్తులు తమ ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని, రైతులు, వ్యాపారస్తులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటుందన్నారు. చింతపండు నిల్వ చేసుకోవడానికి షెడ్లు అవసరమని వ్యాపారులు చెప్పారు. టీడీపీ మైనార్టీ నాయకులు సుహేల్ బాషా, వ్యాపారస్తులు అఫ్సర్‌బాషా, బాబా, హాఫీజ్, అఫ్జల్, షరీఫ్ పాల్గొన్నారు.

పెన్షనర్ల బకాయిలు వెంటనే చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రత్నారెడ్డి

పలమనేరు, నవంబరు7(ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చెల్లింపులకు నోచుకోని ప్రభుత్వ పెన్షనర్ల బకాయిలను ఈ ప్రభుత్వమైనా చెల్లించాలని పలమనేరు పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు రత్నారెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం పలమనేరు పెన్షనర్ల భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బకాయిలను చెల్లించడంతోపాటు పాత అడిషనల్ క్వాంటమ్ శాతాన్ని పునరుద్ధరించాలన్నారు. 12వ పీఆర్సీ వేసి ఐఆర్ ప్రకటించాలన్నారు. అందరూ ఆయుష్మాన్ భారత్, సీనియర్ సిటిజన్ కార్డులను ఎలా పొందాలో వివరించారు. ఉద్యోగ విరమణ చేసి కొత్తగా సభ్యులుగా చేరిన వెంకటేసు, హరిదాని, శివకుమార్‌లను పరిచయం చేశారు. ఆదాయపు పన్ను పరిధిలో ఉన్నవారు తమ పిల్లల ఫీజులు, సేవింగ్స్ వివరాలను ఎస్‌టీఓ కార్యాలయంలో అందజేసి మినహాయింపులు పొందాలని కార్యదర్శి గురుమూర్తి సూచించారు. కమ్యుటేషన్ కాలాన్ని తగ్గించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం దొరస్వామిని కార్యదర్శిగా ఎన్నుకొన్నారు. ఈ సమావేశంలో కోశాధికారి దవణముని, పలువురు పెన్షనర్లు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



సోమలలో వైద్యాధికారుల ర్యాలీ, రొంపిచెర్లలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

రొంపిచెర్ల, నవంబరు7 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు వ్యాధుల పట్ల అప్రమత్తతగా ఉండాలని ప్రాథమిక వైద్యాధికారి దినేష్‌కుమార్ నాయక్ అన్నారు. గురువారం రొంపిచెర్లలో క్యాన్సర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి వెంటనే గుర్తించడం కష్టమని, 30 సంవత్సరాలు నిండిన వారు ఆరు నెలలు లేదా ఏడాదికో ఒక్కసారి తప్పక పరీక్ష చేసుకోవాలన్నారు. క్షయవ్యాధి రాకుండా అడల్ట్ బి సిజి 60 ఏళ్లు నిండినవారందరూ వేయించుకోవాలన్నారు. ఈనెల 14 నుంచి స్కూల్ పిల్లలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ ర్యాలీలో సీహెచ్‌వో కాంతమ్మ, సూపర్‌వైజర్ పంకజ, సిబ్బంది పాల్గొన్నారు.

సోమల : ముందస్తు పరీక్షల ద్వారి క్యాన్సర్ నుంచి రక్షణ పొందవచ్చునని సోమల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జయసింహ తెలిపారు. గురువారం సోమలలో వైద్యసిబ్బంది పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఉచితంగా పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే పెద్దఉప్పరపల్లె వైద్యశాల పరిధిలో డాక్టర్ బాలాజీ, డాక్టర్ సోనియా, కందూరు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో డాక్టర్ నీలిమా, డాక్టర్ విజయలక్ష్మీ ఆధ్వర్యంలో ర్యాలీలు జరిగాయి. వైద్య సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకూ మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి



ఏఐఎస్ఎఫ్ పట్టణ నూతన కమిటీకి ఎంపికైన విద్యార్థులు

పుంగనూరు రూరల్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ చిత్తూరు జిల్లా కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో జరిగిన ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉదయాన్నే 6, 7 గంటలకే దూరప్రాంతాల నుంచి కాలేజీకి వస్తారని, ఆ సమయానికి ఇళ్లలో భోజనాలు చేయడం కష్టమని, వీటిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నభోజన పథకాన్ని అమలు చేయాల్సివుందన్నారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. పట్టణ అధ్యక్షుడిగా సోము, కార్యదర్శిగా గిరీష్, సహాయ కార్యదర్శిగా సిద్దిక్‌మహేశ్, ఉపాధ్యక్షులుగా మన్సూర్ల, గణేశ్ అజయ్, కోశాధికారిగా దిల్దార్, కన్వీనర్లుగా శిరీషా, శ్రావణి, సువర్ణ, పల్లవి, రమ్యశ్రీలను ఎన్నుకున్నట్లు తెలిపారు. నాయకులు మున్నా, సంజయ్ పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికే గ్రామసభలు



వీకే పల్లి గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ జయసింహ

కల్లూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సమగ్ర భూ సర్వేలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికే రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ జయసింహ తెలిపారు. పులిచెర్ల మండలం దేవళంపేట రెవెన్యూ వీకే పల్లిలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర భూ సర్వేలో తలెత్తిన తప్పుఒప్పులను సరిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగమే గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి అర్జీల ను స్వీకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధనంజయనాయుడు, మురళీధర్‌నాయుడు, నారాయణస్వామినాయుడు, ఆర్ఐ దొరస్వామి, రెవెన్యూ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ ప్రమోషన్ కౌన్సిల్ వైస్ ఛైర్మన్‌గా శ్రీనివాసులు



కుప్పం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎంఈ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వైస్ చైర్మన్‌గా కుప్పం పురపాలక సంఘం తంబిగానిపల్లెకు చెందిన కె.శ్రీనివాసులు నియమితులయ్యారు. సంబంధిత కౌన్సిల్ ఛైర్మన్ జితేందర్ ఉమాకాంత్ ఈ మేరకు పంపిన నియామకపత్రం బుధవారం ఆయనకు అందింది. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ తనను వైస్ ఛైర్మన్‌గా నియమించినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి, ఛైర్మన్‌కు, ముఖ్యమంత్రి చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో నలుగురికి జైలు శిక్ష

గుడుపల్లె, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వాహనాల తనిఖీల్లో గురువారం మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన నలుగురికి జైలు శిక్ష, జరిమాన కోర్టు విధించినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ పలు రహదారుల్లో వాహనాలను తనిఖీ నిర్వహించగా మద్యం సేవించి వాహనాలను నడుపుతూ నలుగురు పట్టుబడ్డారన్నారు. వీరిని కుప్పం కోర్టులో హాజరు పరచగా ముగ్గురికి మూడు రోజుల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధించగా, మరో వ్యక్తికి ఏడురోజుల జైలు శిక్ష విధించినట్లు ఆయన తెలిపారు.

క్యాన్సర్‌పై అవగాహన

బైరెడ్డిపల్లె, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తీర్థం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం వైద్యాధికారి డాక్టర్ అరుణ్‌కుమార్ మహిళలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. అజీర్ణం, గుండెల్లో మంట, రాత్రిపూట ఎక్కువ చెమటలు పట్టడం, నిరంతరం దగ్గు, రొమ్ముల ఆకారంలో మార్పులు, ఎముకలు, కీళ్లలో నొప్పులు, శరీరంలో మార్పులుంటే వెంటనే ఆస్పత్రిలో క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యవిద్యాధికారి కాంతమ్మ, సూపర్‌వైజర్ శ్రీదేవి, హెల్త్‌అసిస్టెంట్ రాజారెడ్డి, సిబ్బంది పూర్ణ, ఆయూబ్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

శివ భక్తుల భిక్షాటన



సోమల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం పెద్దఉప్పరపల్లెకు చెందిన శివదీక్ష భక్తులు శివమాల ధరించి బుధవారం రాత్రి గ్రామ వీధుల్లో గురుస్వామి త్రివిక్రమ శాస్త్రి ఆధ్వర్యంలో భిక్షాటన చేశారు. అనంతరం దుర్గం కొండ ఆలయంలో శివ దీక్ష భక్తులు సంకీర్తనలు ఆలపించారు.

పలమనేరు డిగ్రీ కళాశాలలో నేడు జాబ్‌మేళా

పలమనేరు, నవంబరు7 : పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వెంకటేశ్వర్లు తెలిపారు. సీడప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఇండస్ ఇండ్ బ్యాంక్, శ్రీరామ్ చిట్‌ఫండ్స్, దొడ్ల డెయిరీ, ఇన్నోవ్ సోర్స్ సర్వీస్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థలు పాల్గొంటాయన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిగ్రీ ఫెయిల్, పాస్, డెయిరీ టెక్నాలజి చదివి 18 నుంచి 30 సంవత్సరాల వయసు వున్న వారందరూ అర్హులన్నారు.

అయ్యప్ప స్వామికి పూజలు



సోమల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సోమల స్వయంభేశ్వరస్వామి ఆలయంలో గురువారం గురుస్వాములు మారసాని చెన్న కేశవులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. అయ్యప్ప భక్తులు అంబలాన్ని సుందరంగా అలంకరించి వినాయక, అయ్యప్ప, సుబ్రమణ్యం స్వాముల చిత్రపటాలను ఏర్పాటు చేసి అఖండజ్యోతులతో పూజలు జరిపారు. పలు గ్రామాలకు చెందిన అయ్యప్ప భక్తులు పూజలో పాల్గొన్నారు. అనంతరం దేవర్ల చిత్రపటాలను ఊరేగించారు.

అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

సోమల,నవంబరు7(ఆంధ్రజ్యోతి):సోమల మండలం చెన్నపట్నం చెరువు మలుపు వద్ద నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయంలో గురువారం స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. సోమల-పుంగనూరు మార్గంలోని ఈ మలుపు వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో లక్ష్మీపురం గ్రామస్తులు ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. చెన్నయ్యగారిపల్లెకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీరు వెంకటరమణ చొరవతో ఆలయ నిర్మాణ పనులను పూర్తి చేశారు. అర్చకులు రామరత్నం శాస్త్రి ఆధ్వర్యంలో హోమాలు శాస్త్రోక్తంగా జరిపారు.

వయోవృద్ధులకు అక్షరాభ్యాసం

చౌడేపల్లె, నవంబర్7 (ఆంధ్రజ్యోతి) : ఉల్లాస్ కార్యక్రమంతో వయోవృద్ధులకు అక్షరాభ్యాసం అందించనున్నట్లు ఎంపీడీవో లీలామాధవి పేర్కొన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో సంఘమిత్రలతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండలంలో నిరక్ష్యరాసులను గుర్తించి వలంటీర్ టీచర్ల ద్వారా నిరక్షరాసులైన వయోవృద్ధులకు రాత్రి సమయంలో విద్య నేర్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం మణి, సీసీలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

బోయకొండలో యాచకుడి మృతి



చౌడేపల్లె, నవంబర్7 (ఆంధ్రజ్యోతి) : బోయకొండ ఆర్ఆర్ కాలనీ సమీపంలోని ప్రధాన రోడ్డులో యాచకుడి మృతదేహం ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అతడికి నా అన్నవారు ఎవరూలేరని గుర్తించి, పంచాయతీ, రెవెన్యూ అధికారుల సమక్షంలో బోయకొండ శ్మశానంలో అంత్యక్రియలు నిర్వహించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం ఉదయం చౌడేపల్లె మండలంలో జరిగింది. కాటిపేరికి చెందిన రాజు భార్య చైతన్యకు కొద్దిరోజుల క్రితం వివాహం జరిగింది. ఈ క్రమంలో చైతన్య గర్భం దాల్చడంతో పిల్లలు వద్దని భార్యాభర్తలు గొడవ పడ్డారు. దీంతో భర్త రాజు ఈగల మందు తాగడానికి ప్రయత్నం చేయగా భార్య చైతన్య లాక్కుని తాగింది. వెంటనే ఆమెను పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు.

కుటుంబ కలహాలతో మరొకరు...

పుంగనూరు రూరల్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ప్రభుత్వ వైద్యశాల టెక్నీషియన్ బుధవారం రాత్రి యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన పుంగనూరులో చోటుచేసుకుంది తంబళ్లపల్లె నియోజకవర్గం పెద్దమండ్యంకు చెందిన దొరస్వామి భార్య తులసి(25) పుంగనూరు ప్రభుత్వ వైద్యశాలలో టెక్నీషియన్‌గా పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో భార్యాభర్తల మధ్య జరిగిన ఘర్షణ వల్ల తులసి యాసిడ్ తాగి స్పృహ కోల్పోయింది. గుర్తించిన భర్త చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆమె పరిస్థితి విషమించడంతో మదనపల్లెకి తరలించినట్లు తెలిసింది.

మహిళపై పిచ్చికుక్క దాడి

పుంగనూరు రూరల్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): ఓ మహిళపై పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచిన ఘటన గురువారం పెద్దపంజాణి మండలంలో జరిగింది. కమ్మినాయునిపల్లెకు చెందిన మునిరత్నం భార్య నాగవేణి(28) ఇంటి ముందు ఉండగా ఓ పిచ్చికుక్క వచ్చి దాడి చేసి గాయపరిచింది. గాయపడిన నాగవేణి పుంగనూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.

హిందూ జాగరణ సమితి నూతన కార్యవర్గం



మాట్లాడుతున్న హిందూ జాగరణ సమితి గౌరవాధ్యక్షుడు త్రిమూర్తిరెడ్డి

పుంగనూరు రూరల్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): పుంగనూరు హిందూ జాగరణ సమితి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘ గౌరవాధ్యక్షుడు త్రిమూర్తి రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక కొత్తయిండ్లు షిరిడి సాయిబాబా మందిరంలో జరిగిన కార్యవర్గసభ్యుల సమావేశంలో నూతన అధ్యక్షుడుగా కె. పరమేశ్, ప్రధాన కార్యదర్శిగా హరీష్, ఉపాధ్యక్షులుగా పి. గంగాధర్, కోశాధికారిగా పి. రాజేశ్‌శివకుమార్, పీఆర్వోగా వెంకటేశ్‌మొదలియార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.